ట్రంప్‌పై హత్యాయత్నం

నాపైనా రెండుసార్లు హత్యాయత్నం

ఎలాన్ మస్క్ వెల్లడి

వాషింగ్టన్, జూలై 14: ట్రంప్‌పై కాల్పుల ఘటనతో అమెరికా ఉలిక్కిపడింది. గతంలో తనపైనా రెండుసార్లు హత్యాయత్నాలు జరిగాయన్న సంగతిని ప్రపంచ కుబేరుడు, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ తాజాగా బయటపెట్టారు. టెక్సాస్‌లోని టెస్లా ప్రధాన కార్యాలయానికి సమీపంలో తుపాకులతో సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తుల్ని అరెస్టు చేసినట్టు మస్క్ చెప్పాడు. ట్రంప్‌పై కాల్పుల ఘటన నేపథ్యంలో, మస్క్ భద్రతపై 'ఎక్స్' ఖాతాదారు ఒకరు ఆందోళన వ్యక్తం చేశారు. 'దయచేసి.. మీ వ్యక్తిగత భద్రతను మూడింతలు చేయండి. ట్రంప్‌పై గన్ ఎక్కుపెట్టినవారు.. ఏదో ఒక రోజు మీపైకి కూడా వస్తారు' అంటూ మస్క్‌ను హెచ్చరించాడు. దీనిపై స్పందించిన మస్క్, గత 8 నెలల్లో తనపై రెండుమార్లు హత్యాయత్నం జరిగిందన్న సంగతిని 'ఎక్స్'లో చెప్పుకొచ్చారు. ఇదిలా ఉండగా, కాల్పుల ఘటనలో గాయపడ్డ ట్రంప్ త్వరగా కోలుకోవాలని మస్క్ ఆకాంక్షించారు.

19న సీయూఈటీ-యూజీ రీటెస్ట్

ఫలితాలు ఎప్పుడన్నది తెలుపని ఎన్‌టీఏ

న్యూఢిల్లీ, జూలై 14: దాదాపు వెయ్యి మందికిపైగా అభ్యర్థులకు సీయూఈటీ-యూజీ రీటెస్ట్‌ను ఈ నెల 19న నిర్వహిస్తున్నట్టు ఎన్‌టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) ఆదివారం ప్రకటించింది. పరీక్షకు సంబంధించి జూలై 7న ప్రొవిజినల్ ఆన్సర్ కీ విడుదల చేసిన ఎన్టీఏ.. పరీక్షపై అభ్యర్థుల నుంచి ఏవైనా అభ్యంతరాలు వస్తే, వాటిని పరిశీలించి జూలై 15-19 మధ్య రీటెస్ట్ నిర్వహిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా రీటెస్ట్ పరీక్ష తేదీని ఖరారు చేసింది. అయితే ప్రవేశ పరీక్ష ఫలితాల కోసం దేశవ్యాప్తంగా విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ఫలితాల విడుదలపై ఎన్టీఏ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

అమెరికా మాజీ అధ్యక్షుడిపై కాల్పులు

- ఎన్నికల సభలో ప్రసంగిస్తుండగా ఘటన
- కుడి చెవిని తాకుతూ దూసుకెళ్లిన బుల్లెట్
- ప్రాణాలతో బయటపడ్డ డొనాల్డ్ ట్రంప్
- కాల్పుల్లో ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు
- దుండగుడిని మట్టుబెట్టిన సీక్రెట్ సర్వీస్
- కాల్పులు జరిపిన వ్యక్తిని గుర్తించిన ఎఫ్‌బీఐ
- ఘటనను ఖండించిన ప్రపంచ దేశాధినేతలు
- ఐక్యంగా నిలబడదాం: ట్రంప్ పిలుపు

చికాగో, జూలై 14: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం జరిగింది. శనివారం పెన్సిల్వేనియాలోని బట్లర్ పట్టణంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ట్రంప్(78) మాట్లాడుతుండగా ఓ దుండగుడు ఆయనపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ట్రంప్ కుడి చెవికి గాయమైంది. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు వెంటనే స్పందించడంతో ట్రంప్ తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనలో ప్రచార సభకు హాజరైన ఒక వ్యక్తి మరణించగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ట్రంప్‌పై కాల్పులు జరిపిన దుండగుడిని వెంటనే సీక్రెట్ సర్వీస్ స్నైపర్ ఒకరు కాల్చి చంపేశారు. అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న వేళ జరిగిన ఈ అసాధారణ ఘటన అమెరికాను కుదిపేస్తున్నది.

తనపై కాల్పుల అనంతరం 'ఫైట్' అంటూ నినదిస్తున్న ట్రంప్ చుట్టూ రక్షణగా చేరి ఆయనను కిందకు తీసుకెళుతున్న సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు

కుడి చెవికి గాయం.. ముఖంపై రక్తపు ధారలు

రిపబ్లికన్ పార్టీ తరపున మరోసారి పోటీ చేస్తున్న ట్రంప్ శనివారం బట్లర్‌లో ఎన్నికల ప్రచార సభను నిర్వహించారు. సాయంత్రం 6:15 గంటల సమయంలో తన మద్దతుదారుల మధ్యలో ఆయన ప్రసంగం ప్రారంభిస్తుండగా.. సమీపంలోని ఓ రేకుల నిర్మాణంపై నక్కిన దుండగుడు ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరిపాడు. ఒక బుల్లెట్ ట్రంప్ కుడి చెవిని తాకుతూ దుసుకెళ్లింది. దీంతో ప్రాణాలను కాపాడుకునేందుకు ఆయన పోడియం వెనుక మోకాళ్లపై కుర్చున్నారు. వెంటనే అప్రమత్తమైన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు ట్రంప్ చుట్టూ రక్షణగా చేరి ఆయనను వేదిక కిందకు తీసుకెళ్లారు. ఈ ఘటనలో ట్రంప్ కుడి చెవికి గాయమై రక్తస్రావమైంది. ఆయన ముఖంపై రక్తపు ధారలు కారుతుండగానే.. సభకు హాజరైన జనాన్ని ఉద్దేశించి ట్రంప్ అభివాదం చేశారు. పిడికిలి బిగించి, 'ఫైట్, ఫైట్, ఫైట్' అని నినదించారు. వెంటనే ట్రంప్‌ను పిట్స్‌బర్గ్ ఏరియా హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. దుండగుడు జరిపిన కాల్పుల్లో సభకు హాజరైన ఓ వ్యక్తి మరణించగా, మరో ఇద్దరు గాయపడి చికిత్స పొందుతున్నారు.

దుండగుడి గుర్తింపు

దుండగుడిని బెథెల్ పార్క్‌కు చెందిన థామస్ మాథ్యూ క్రూక్స్(20)గా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై అమెరికా ఎఫ్‌బీఐ విచారణ ప్రారంభించింది. దుండగుడు సభా ప్రాంగణంలోకి తుపాకీని ఎలా తీసుకెళ్లగలిగాడు, ఏ ఉద్దేశంతో కాల్పులు జరిపాడు అనేది తేలాల్సి ఉందని ఎఫ్‌బీఐ పిట్స్‌బర్గ్ ప్రాంత స్పెషల్ ఏజెంట్ కెవిన్ రోజెక్ తెలిపారు. అతడి గురించి సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లకు చెప్పినా పట్టించుకోలేదని ఓ ప్రత్యక్ష సాక్షి ఆరోపించాడు.

రిపబ్లికన్ ఓటరుగా నమోదై..

ట్రంప్‌పై కాల్పులు జరిపినట్టుగా భావిస్తున్న థామస్ మాథ్యూ క్రూక్స్ ఎవరనే అంశంపై ఎఫ్‌బీఐ విచారణ జరుపుతున్నది. అతడు రిపబ్లికన్ పార్టీ ఓటరుగా నమోదు చేసుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. అయితే, 2021లో డెమొక్రటిక్ పార్టీ అనుబంధ ప్రోగ్రెసివ్ టర్న్‌అవుట్ ప్రాజెక్ట్‌కు కూడా క్రూక్ 15 డాలర్లు విరాళంగా ఇచ్చారనే ప్రచారం కూడా జరుగుతున్నది. కాగా, క్రూక్స్ ఇంట్లో, కారులో బాంబు తయారీ ముడిపదార్థాలను భద్రతా సిబ్బంది గుర్తించారు.

అమెరికాలో ఇలాంటి ఘటనను నమ్మలేకపోతున్నా: ట్రంప్

కాల్పుల ఘటనపై ట్రంప్ తన 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేశారు. 'మన దేశంలో ఇలాంటి ఘటన జరగడాన్ని నమ్మలేకపోతున్నా. నన్ను కాల్చిన ఒక బుల్లెట్ నా కుడి చెవి పైభాగాన్ని తాకింది. బుల్లెట్ శబ్దం విని ఏదో జరుగుతున్నది అని అనుకుంటుండగానే నాకు బుల్లెట్ తగిలింది. తీవ్ర రక్తస్రావం అయ్యింది. అప్పుడు నాకు ఏం జరిగిందో అర్థమైంది. గాడ్ బ్లెస్ అమెరికా' అంటూ ఆయన పేర్కొన్నారు. తర్వాత ఆయన మరోసారి స్పందిస్తూ.. 'ఊహించని పరిణామం నుంచి ఆ దేవుడే కాపాడాడు. ఈ సమయంలో అమెరికన్లు ఐక్యంగా నిలబడాల్సిన అవసరం ఉంది. మన అసలైన స్వభావాన్ని చాటి, చెడు గెలవకుండా చూడాలి' అని పిలుపునిచ్చారు. ఆటుపోట్లను తట్టుకుంటామన్నారు.

అమెరికాలో హింసకు చోటు లేదు: బైడెన్

ట్రంప్‌పై హత్యాయత్నాన్ని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఖండించారు. ట్రంప్ సురక్షితంగా ఉన్నందుకు సంతోషమని, ఆయన కోసం, ఆయన కుటుంబం కోసం ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. ట్రంప్‌ను రక్షించిన సీక్రెట్ సర్వీస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అమెరికాలో ఇలాంటి హింసకు తావులేదని, దేశమంతా ఐక్యంగా ఈ ఘటనను ఖండించాలని పిలుపునిచ్చారు. ట్రంప్‌తోనూ బైడెన్ ఫోన్‌లో మాట్లాడారని వైట్ హౌజ్ అధికారి చెప్పారు.

ఖండించిన ప్రపంచ దేశాధినేతలు

తన స్నేహితుడు ట్రంప్‌పై జరిగిన దాడిని ఖండిస్తున్నట్టు భారత ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాజకీయాలు, ప్రజాస్వామ్యాల్లో హింసకు చోటు లేదని, ట్రంప్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వివిధ దేశాధినేతలు కూడా దాడిని ఖండించారు.

ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన రెండు గంటలకే ఆయన పిడికిలి బిగించి నినదిస్తున్న ఫొటోలతో కూడిన టీ-షర్టులు చైనాలో అమ్మకానికి ఉంచారు. చైనా, అమెరికా నుంచి ఈ టీ షర్టుల కొనుగోలుకు భారీగా ఆర్డర్లు రావడం గమనార్హం.

పెరిగిన ట్రంప్ విజయావకాశాలు

అమెరికా అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న వేళ ట్రంప్‌పై హత్యాయత్నం ఘటన రాజకీయాలను మలుపుతిప్పే అవకాశం ఉందని సర్వే సంస్థలు చెప్తున్నాయి. నవంబరులో అధ్యక్ష ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. ట్రంప్‌పై హత్యాయత్నం ఘటన జరిగిన తర్వాత ట్రంప్ విజయావకాశాలు పెరిగినట్టు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ట్రంప్ విజయావకాశాలు ఒకేసారి 8% పెరిగి, 70 శాతానికి చేరుకున్నట్టు రాజకీయాలను అంచనా వేసే పాలిమార్కెట్ అనే సంస్థ పేర్కొన్నది.



అబ్రహం లింకన్ | జేమ్స్ గార్‌ఫీల్డ్ | విలియం మెకెన్లీ | జాన్ ఎఫ్ కెనడీ

అబ్రహం లింకన్ నుంచి కెనడీ దాకా..

హత్యకు గురైన నలుగురు అధ్యక్షులు!

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌పై ఎన్నికల ప్రచారం సందర్భంగా జరిగిన హత్యాయత్నం సంచలనం రేపింది. ఇంతకు ముందు కూడా అమెరికాలో అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, ప్రధాన పార్టీల అభ్యర్థులే లక్ష్యంగా పలుమార్లు హింసాత్మక దాడులు జరిగాయి. దాడుల కారణంగా ఏకంగా నలుగురు అధ్యక్షులు మరణించగా.. హత్యాయత్నాలతో పలువురు గాయపడ్డారు.

1865: హత్యకు గురైన అమెరికా మొదటి అధ్యక్షుడు అబ్రహం లింకన్. 1865, ఏప్రిల్ 14న ఆయన తన భార్యతో కలిసి వాషింగ్టన్‌లోని ఫోర్డ్స్ థియేటర్‌లో ఓ ప్రత్యేక కార్యక్రమానికి హాజరైన సమయంలో జాన్ వైక్స్ అనే వ్యక్తి కాల్పులు జరిపాడు. తలలో బలమైన గాయంతో లింకన్ తర్వాతి రోజున మరణించారు. నల్లజాతీయుల హక్కుల కోసం మద్దతు తెలపడమే ఆయన హత్య వెనుక కారణమని దర్యాప్తులో తేలింది.

1881: అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోనే అధ్యక్షుడు జేమ్స్ గార్‌ఫీల్డ్ హత్యకు గురయ్యారు. 1881, జూలై 2న న్యూ ఇంగ్లండ్‌లోని ఓ రైల్వే స్టేషన్‌లో ఆయనపై చార్లెస్ గిటౌ అనే వ్యక్తి కాల్పులకు పాల్పడ్డాడు. తర్వాత కొద్ది వారాలకు గార్‌ఫీల్డ్ మరణించారు.

1901: సెప్టెంబర్ 6న న్యూయార్క్‌లోని బఫెలో నగరంలో ప్రసంగించిన తర్వాత అధ్యక్షుడు విలియం మెకెన్లీపై కాల్పుల ఘటన చోటుచేసుకొన్నది. ప్రజలకు షేక్‌హ్యాండ్ ఇస్తున్న క్రమంలో పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో మెకెన్లీ ఛాతిపై లియోన్ అనే 28 ఏండ్ల నిరుద్యోగి రెండు రౌండ్ల కాల్పులు జరిపాడు. మెకెన్లీ వారం తర్వాత మరణించారు.

1963: డల్లాస్ పర్యటన సందర్భంగా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడీ కాన్వాయ్‌పై దాడి జరిగింది. దుండగుడి కాల్పుల్లో తీవ్ర గాయాలైన కెనడీని పార్క్‌ల్యాండ్ దవాఖానకు తరలించారు. ఆ తర్వాత ఆయన మరణించారు.

పలువురు నేతలపై కాల్పుల ఘటనలు

1933లో ఫ్రాంక్లిన్ రూస్‌వెల్ట్‌పై(32వ అధ్యక్షుడు), 1950లో హ్యారీ ఎస్ తుర్మాన్ (33వ అధ్యక్షుడు), 1975లో జెరాల్డ్ ఫోర్డ్‌పై (38వ అధ్యక్షుడు), 1981లో రొనాల్డ్ రీగన్(40వ అధ్యక్షుడు), 2005లో జార్జి డబ్ల్యూ బుష్(43వ అధ్యక్షుడు)పై హత్యాయత్నాలు జరిగాయి. పలువురు అధ్యక్ష అభ్యర్థులపై కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి.

75 మంది సిబ్బంది.. 24 గంటలూ

అమెరికా మాజీ అధ్యక్షులకు పటిష్ఠ భద్రత

న్యూయార్క్, జూలై 14: డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అగ్రరాజ్యంలో ఒక మాజీ అధ్యక్షుడు, మరోసారి అధ్యక్ష బరిలో ఉన్న వ్యక్తిపై ఇలాంటి ఘటన జరగడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అసలు ట్రంప్ భద్రత ఎలా ఉంటుందనే చర్చ మొదలయ్యింది. సాధారణంగా అమెరికా మాజీ అధ్యక్షుల దంపతులకు జీవితాంతం అమెరికా సీక్రెట్ సర్వీస్ భద్రతను కల్పిస్తుంది. 75 మంది సిబ్బంది 24 గంటలూ రక్షణగా ఉంటారు. ట్రంప్ ఇప్పుడు మాజీ అధ్యక్షుడే కాకుండా అధ్యక్ష బరిలో ఉన్న అభ్యర్థి. కాబట్టి, మిగతా మాజీ అధ్యక్షుల కంటే ఆయనకు ఎక్కువ భద్రతను కల్పించారు. ఇటీవల ట్రంప్ భద్రతను మరింత పెంచినట్టు సీక్రెట్ సర్వీస్ ప్రకటించింది. అయినప్పటికీ ట్రంప్‌పై అసాధారణ రీతిలో హత్యాయత్నం ఘటన జరగడంతో సీక్రెట్ సర్వీస్‌పై విమర్శలు మొదలయ్యాయి.

తెరుచుకున్న భాండాగారం

- 46 ఏండ్ల తర్వాత ఇదే తొలిసారి
- ప్రత్యేక పూజల అనంతరం పూరీ జగన్నాథుడి రత్న భాండాగారం తలుపులు తెరిచిన కమిటీ
- లెక్కింపునకు మరి కొంత సమయం: ఆలయ ప్రధానాధికారి

రత్న భాండాగారంలోని విలువైన వస్తువులను సేకరించే పెట్టెలు ఆలయంలోకి తరలింపు

పూరీ: ఒడిశాలోని పూరీలో 12వ శతాబ్దానికి చెందిన జగన్నాథుడి ఆలయ రత్న భాండాగారం 46 ఏండ్ల తర్వాత తెరుచుకొన్నది. ఆదివారం ప్రత్యేక పూజల అనంతరం ఆ రహస్య గదిని తెరిచారు. మొత్తం 11 మంది లోపలికి వెళ్లారు. భాండాగారంలోని ఆభరణాలు, ఇతర విలువైన వస్తువుల లెక్కింపు, గది మరమ్మతుల నిమిత్తం తలుపులు తెరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఆలయానికి మధ్యాహ్నం 12 గంటలకు చేరుకొన్నది. మధ్యాహ్నం 1.28 గంటలకు భాండాగారం తలుపులు తెరిచారు. ట్రెజరీని తెరిచిన సమయంలో ప్రభుత్వం నియమించిన కమిటీ చైర్మన్, ఒడిశా హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ బిశ్వనాథ్ రథ్, జగన్నాథ్ ఆలయ ప్రధానాధికారి అరవింద పాధీ, ఏఎస్ఐ సూపరింటెండెంట్ గదనాయక్, పూరీ రాజు గజపతి మహారాజు ప్రతినిధి తదితరులు ఉన్నారు.

తాళాలు పగులగొట్టి లోపలికి..

ఆలయ ప్రధానాధికారి అరవింద పాధీ మీడియాతో మాట్లాడుతూ 'అధికారిక వ్యక్తులు ట్రెజరీ వద్దకు వెళ్లగా, తలుపునకు మూడు తాళాలు ఉన్నాయి. జిల్లా అధికారుల వద్ద ఉన్న తాళం చెవి పని చేయలేదు. దీంతో మేజిస్ట్రేట్ సమక్షంలో తాళాలను పగులగొట్టాం. ఆ తర్వాత లోపలికి వెళ్లి చెక్కపెట్టెలు, బీరువాల్లో ఉన్న ఆభరణాలు, ఇతర వస్తువులను పరిశీలించాం' అని తెలిపారు. వాటన్నింటినీ ఆలయంలోనే ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించామని, రూమ్‌కు సీల్ వేశామని తెలిపారు. భాండాగారం లోపల పరిస్థితిని పురావస్తు శాఖ ఏఎస్ఐ పరిశీలించిందని, మొత్తం ప్రక్రియను వీడియోగ్రఫీ చేసినట్టు అధికారులు తెలిపారు.

బహుద యాత్ర, సునా వేశ తర్వాతే..

'తరలింపు ప్రక్రియ అంతా ఒకేసారి జరగాలి. అది ఈ రోజు సాధ్యం కాదు. భాండాగారంలో ఉన్న విలువైన వస్తువులను ప్రస్తుతానికి తరలించకూడదని కమిటీ నిర్ణయించింది' అని అరవింద పాధీ వెల్లడించారు. బహుద యాత్ర, సునా వేశ కార్యక్రమాల అనంతరం ఆభరణాల తరలింపు తేదీని నిర్ణయిస్తాం అని తెలిపారు. మరమ్మతుల తర్వాత నిధిని తిరిగి ట్రెజరీలోకి తీసుకొస్తారని, తర్వాత లెక్కింపు ఉంటుందని అరవింద్ పాధీ తెలిపారు. అంతకుముందు విలువైన వస్తువులను తరలించేందుకు తయారు చేయించిన 15 చెక్కపెట్టెల్లో ఆరింటిని ఆలయానికి తీసుకొచ్చారు.

అప్పుడు 70 రోజుల సమయం

చివరిసారి 1978లో రత్న భాండాగారాన్ని తెరిచారు. ట్రెజరీలోని నిధి లెక్కింపునకు 70 రోజుల సమయం పట్టింది. అప్పట్లో కొన్నింటిని వదిలేయడంతో లెక్కలపై సందేహాలున్నాయి. 2018లో హైకోర్టు ఆదేశాల మేరకు భాండాగారం తలుపులు తెరిచేందుకు ప్రయత్నించారు. అయితే అసలైన తాళాలు లేకపోవడంతో ఆ ప్రక్రియ వాయిదా పడింది.

ఆభరణాల వివరాల డిజిటలైజేషన్

దశాబ్దాల తర్వాత గదిని తెరవడంతో విషసర్పాలు ఉండే అవకాశం ఉందన్న ఉద్దేశంతో పాములు పట్టే నిపుణులను సిద్ధంగా ఉంచారు. అయితే పాములు ఏమీ లేవని అధికారులు తెలిపారు. ఆభరణాల బరువు, తయారీ వంటి వాటి వివరాలతో ప్రభుత్వం డిజిటల్ క్యాటలాగ్ సిద్ధం చేయనున్నది.

బీజేపీలో చేరిన హైకోర్టు మాజీ జడ్జి

భోపాల్, జూలై 14: వివాదాస్పద తీర్పులతో వార్తల్లో నిలిచిన మధ్యప్రదేశ్ హైకోర్టు మాజీ జడ్జి రోహిత్ ఆర్య బీజేపీలో చేరారు. ఈ విషయాన్ని ఆదివారం ఆయన నిర్ధారించారు. పార్టీ చీఫ్ రాఘవేంద్ర శర్మ భోపాల్‌లోని పార్టీ కార్యాలయంలో ఆర్యను పార్టీలో చేర్చుకున్నారు. మూడు నెలల క్రితమే ఆర్య హైకోర్టు జడ్జీగా పదవీ విరమణ చేశారు. తీర్పుల సందర్భంగా ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేసేవారు. హిందూ దేవతలకేసులో స్టాండప్ కమెడియన్ మున్వర్ ఫారూఖీకి 2021లో బెయిల్ తిరస్కరించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అలాగే లైంగిక వేధింపుల కేసులో బెయిల్ షరతుగా నిందితుడు బాధితురాలితో రాఖీ కట్టించుకోవాలని, ఆమెకు 11 వేలు బహుమతిగా ఇవ్వాలని 2020లో ఒక కేసులో ఆదేశించారు.

చంద్రుడిపైనా నావిగేషన్ వ్యవస్థ

ఏర్పాటుకు చైనా శాస్త్రవేత్తల ప్రణాళిక

బీజింగ్, జూలై 14: భూమిపైన ఉన్నట్టుగానే చంద్రుడిపైన కూడా శాటిలైట్ నావిగేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు పలువురు చైనా శాస్త్రవేత్తలు ప్రణాళికను రూపొందించారు. బీజింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్‌క్రాఫ్ట్ సిస్టమ్ ఇంజినీరింగ్‌కు చెందిన బృందం చంద్రుడి చుట్టూ 21 ఉపగ్రహాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. చంద్రుడి అణువణువూ తెలుసుకునేలా ఈ నావిగేషన్ వ్యవస్థ పని చేస్తుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. నాలుగు కక్ష్యల్లో, మూడు దఫాల్లో ఈ ఉపగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇది సుస్థిరమైన, తక్కువ ఖర్చుతో కూడుకున్న ప్రతిపాదన అని తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు చైనీస్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. చంద్రుడిపై పరిశోధనలకు గానూ చైనా లక్ష్యాలకు ఈ నావిగేషన్ వ్యవస్థ ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. కాగా, ప్రస్తుతం భూమిపై అమెరికాకు చెందిన జీపీఎస్ ఉన్నట్టుగానే, చైనాకు సైతం బీడౌ పేరుతో సొంత నావిగేషన్ వ్యవస్థ ఉంది.

గ్రహశకలాలపై మైనింగ్

అంతరిక్ష నిర్మాణాల కోసం ఆస్టరాయిడ్స్ నుంచి మెటీరియల్స్: పిక్సెల్ స్పేస్

బెంగళూరు, జూలై 14: భవిష్యత్తులో అంతరిక్షంలో చేపట్టబోయే నిర్మాణాల కోసం కావాల్సిన పదార్థాలను గ్రహశకలాల నుంచి సేకరించే అవకాశం ఉందని అంటున్నది బెంగళూరుకు చెందిన అంతరిక్ష రంగ స్టార్టప్ పిక్సెల్ స్పేస్. ఈ సంస్థ సీఈవో అవైస్ అహ్మెద్ తమ భవిష్యత్తు ప్రణాళికలను 'పీటీఐ'కు వెల్లడించారు. అంతరిక్షంలో నిర్మాణాల కోసం కావాల్సిన పదార్థాలను గుర్తించేందుకు చంద్రుడు, గ్రహశకలాలను మ్యాప్ చేయాలనే ఆలోచనలు ఉన్నట్టు తెలిపారు. భవన నిర్మాణ పదార్థాలు, ఇంధన వనరులను గ్రహశకలాల్లో అన్వేషించాలనే దీర్ఘకాలిక ప్రణాళిక ఉన్నట్టు చెప్పారు. భవిష్యత్తులో అంతరిక్షంపైకి మానవాళి విస్తరిస్తే.. కావాల్సిన పదార్థాలను భూమి నుంచి తీసుకెళ్లడం తెలివైన పని కాదని, అంతరిక్షంలో ఇంకా ఎక్కువ పదార్థాలు ఉన్నాయని తెలిపారు.

నేపాల్ కొత్త ప్రధానిగా కేపీ శర్మ ఓలి

కాఠ్మాండూ, జూలై 14: నేపాల్ ప్రధానిగా కేపీ శర్మ ఓలి మూడోసారి నియమితులయ్యారు. శుక్రవారం ప్రజాప్రతినిధుల సభలో విశ్వాస పరీక్షలో ప్రధాని పుష్పకుమార్ దహల్ ప్రచండ ఓడిపోవడంతో ఓలి నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. అస్థిరతకు మారుపేరైన నేపాల్‌లో సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఓలి ముందున్న అతిపెద్ద సవాల్. నేపాల్-యునైటెడ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్ (సీపీఎన్-యూఎంఎల్), నేపాల్ కాంగ్రెస్ (ఎన్‌సీ)లతో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వంలో కొత్త ప్రధానిగా ఓలిని అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్ ఆదివారం నియమించారు. ఓలి, అతని మంత్రివర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేస్తుంది. కాగా ఓలి గతంలో 2015-16, 2018-2021 కాలంలో ప్రధానిగా పనిచేయగా, ఇప్పుడు మూడోసారి అధికారం చేపట్టనున్నారు.

ఒకే రోజు 11 లక్షల మొక్కలు

ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ ఒకే రోజు అత్యధిక సంఖ్యలో మొక్కలు నాటి గిన్నిస్ రికార్డును సాధించింది. ఆదివారం 24 గంటల్లో 11 లక్షల మొక్కలను నాటి కొత్త రికార్డును నెలకొల్పింది. మొక్కలు నాటే కార్యక్రమంలో 2 వేల మంది బీఎస్ఎఫ్ జవాన్లు, వంద మందికి పైగా ఎన్ఆర్ఐలు, ఎన్‌సీసీ కేడెట్లు, 50 స్కూళ్లకు చెందిన విద్యార్థులు, పౌరులు, వివిధ స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు భాగస్వాములయ్యారు. కాగా, అంతకుముందు ఈ గిన్నిస్ రికార్డు అస్సాం రాష్ట్రం పేరుపై ఉంది. 2023 సెప్టెంబర్ 13, 14 తేదీల్లో ఆ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 9,21,730 మొక్కలను నాటారు. ఇప్పుడు ఇండోర్ ఆ రికార్డును అధిగమించింది. గిన్నిస్ బుక్ సర్టిఫికెట్‌ను మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ సామాజిక మాధ్యమంలో షేర్ చేశారు.

పొదుపు చేస్తే.. మంచిగ నిద్ర

లండన్, జూలై 14: డబ్బుతో సంతోషాన్ని కొనలేం.. కానీ, ప్రతి నెలా ఎంతో కొంత పొదుపు చేయటం భవిష్యత్తుపై భరోసాను కల్పిస్తుంది. అలా డబ్బులు పొదుపు చేసే వారికి హాయిగా నిద్ర పడుతుందని, చక్కగా రిలాక్సవుతారని 'బ్రిస్టల్ యూనివర్సిటీ' అధ్యయనం వెల్లడించింది. సేవింగ్స్‌కూ, స్లీపింగ్‌కూ సంబంధం ఉన్నదని పేర్కొన్నది. 'యాక్ట్ ఆఫ్ సేవింగ్'పై సర్వే నిర్వహించగా ఆసక్తికర వివరాలు వెల్లడించారు. ఆర్థిక నేపథ్యం, తాము ధనవంతులా? పేదలా? అన్నదాంతో సంబంధం లేకుండా, ప్రతి నెలా పొదుపు చేసేవారిలో ఒకే విధమైన సంతృప్తి స్థాయిలు ఉన్నట్టు పరిశోధకులు గుర్తించారు. పొదుపు చేయకపోవటం.. తమను ఎంతగానో అసంతృప్తికి గురిచేసేదని గత పదేండ్లుగా పొదుపు పాటిస్తున్న కొంతమంది సర్వేలో చెప్పారు.

అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహం లింకన్ గే!

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహం లింకన్ గే అని తాజా డాక్యుమెంటరీ చెప్తున్నది. 'లవర్ ఆఫ్ మెన్ : ది అన్‌టోల్డ్ హిస్టరీ ఆఫ్ అబ్రహం లింకన్' పేరుతో రూపొందించిన ఈ డాక్యుమెంటరీలో పురుషులతో లింకన్ రొమాంటిక్ రిలేషన్‌షిప్స్ గురించి వివరించారు. ప్రముఖ లింకన్ స్కాలర్స్ చెప్పిన విషయాలు, ఇప్పటి వరకు బయటపడని ఫొటోలు, లేఖలు వంటివాటి ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. హార్వర్డ్, కొలంబియా తదితర ప్రతిష్ఠాత్మక సంస్థలకు చెందిన చరిత్రకారుల ఇంటర్వ్యూలు ఈ డాక్యుమెంటరీలో ఉన్నాయి. సెక్సువల్ నియమాలు 19వ శతాబ్దంలో ఎలా ఉండేవి? ఇప్పుడు ఎలా ఉన్నాయి? వాటి మధ్య తేడాలు ఏమిటి? అనే అంశాలను దీనిలో వివరించారు.

డిటెక్టివ్‌గా ఏంజెలా మెర్కెల్!

న్యూఢిల్లీ, జూలై 14: జర్మన్ మాజీ చాన్స్‌లర్ ఏంజెలా మెర్కెల్ ఇప్పుడు కొత్త పాత్రలో దర్శనమివ్వనున్నారు. రిటైరైన తర్వాత ఆమె ప్రముఖ జర్మనీ పాపుల్ టీవీ షోలో ఆమె మిస్ మార్పెల్‌గ